నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 24 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

ఐదో రోజు 23 నామినేషన్లు

కరీంనగర్‌లో 12, పెద్దపల్లిలో 11

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఐదో రోజు కరీంనగర్, పెద్దపల్లి స్థానాలకు 23 నామినేషన్లు వచ్చాయి. కరీంనగర్ 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఇద్దరు రెండో సెట్ సమర్పించగా, మిగతా పది మంది మొదటి సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి అందజేశారు. మొదటి సెట్టు నామినేషన్లు వేసిన వారిలో నగరానికి చెందిన జహేదాబేగం, పెద్దపల్లి శ్రీకాంత్, కట్కూరి ఎనోస్, మేకల అక్షయ్‌కుమార్, గుడిసె మోహన్, సూరం చంద్రశేఖర్, పేరాల మానసరెడ్డి, పిడిశెట్టి రాజు, పొత్తూరి రాజేందర్ స్వతంత్ర అభ్యర్థులుగా, పంచిక అశోక్, సోషలిస్టు జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కడ్తాల అనిల్‌రెడ్డి ఉన్నారు. పెద్దపల్లిలో 11 నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్ (రెండో సెట్), తాళ్లపల్లి నరేశ్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేశ్, కట్కూరి సందీప్ (రెండో సెట్), సొల్లు రంజిత్, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమొక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేశ్ (రెండో సెట్), అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, బీఎస్‌పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజు నర్సయ్య, సోషలిస్ట్ పార్టీ (ఇండియా) అభ్యర్థిగా ములకల కనకయ్య నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

కార్యకర్తలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపు

హుజూరాబాద్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికలకు 'బీఆర్ఎస్ కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలి. సైనికుల్లా పనిచేసి కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలి' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లోని సిటీ సెంటర్లో మంగళవారం బీఆర్ఎస్ మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వార్డుల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువగా సాధించాలని నిర్దేశించారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినపడాలంటే వినోద్ గెలువాల్సిందేనన్నారు. కార్యకర్తలు కేసీఆర్ అమలు చేసిన పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ఓట్లడగాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే నట్టేట ముంచుతారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పార్టీ మండల, టౌన్ అధ్యక్షులు సంఘం ఐలయ్య, కొలిపాక శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు గూడూరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు మహ్మద్ అమ్జత్, శఫీ, కాసగోని కిరణ్, దయాకర్‌రెడ్డి, పూర్ణంచర్, కోండ్ర నరేశ్, తొగరు భిక్షపతి, శ్రీనివాస్, వాసుదేవారెడ్డి, రీజాజ్, సాయి, రాజు, రవీందర్, గందె శ్రీనివాస్. సురేందర్‌రెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

కరీంనగర్: టీవీలో కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు

బాపు స్పీచ్ కోసం టీవీల ముంగట

కేసీఆర్ ఇంటర్వ్యూను ఆసక్తిగా వీక్షించిన ప్రజానీకం

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత, బాపు కేసీఆర్ ఇంటర్వ్యూను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి ఓ చానల్‌లో ఇంటర్వ్యూ ప్రసారం కాగా.. వివిధ రంగాల నిపుణులు, అభిమానులు, నాయకులతో పాటు సామాన్య ప్రజలు టీవీలకు అతుక్కుపోయి వీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో ఊరంతా ఏకమై నడి బొడ్డున బడా స్క్రీన్ ఏర్పాటు చేసుకుని చూశారు. కరీంనగర్‌లోని తన కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తిలకించారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మళ్లీ మోసానికి కుట్ర

పోస్టుకార్డులను పోస్టుబాక్స్‌లో వేస్తున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ నాయకులు

- కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- ఆరు గ్యారెంటీలు ఇవ్వకుండా మోసం చేసింది
- పార్లమెంట్ ఎన్నికల్లో దగా చేయాలని చూస్తున్నది
- ఆ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టాలి
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభం

మంథని, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నదని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా దగా చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మరోసారి వస్తున్న ఆ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. ఆ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. ₹రెండు లక్షల రుణమాఫీని చేయాలని, ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹25వేల నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బోనస్ ఇవ్వాలని, వడ్లు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మంథనిలోని మార్కెట్ యార్డులో మంగళవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. పార్లమెంట్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి ఓరుగంటి వెంకటరమణారావుతో కలిసి పుట్ట మధూకర్ ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పి మాటతప్పిందని మండిపడ్డారు. వరికి బోనస్, ₹15వేల రైతుబంధు, రుణమాఫీ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కనీసం రైతు రుణమాఫీ ప్రక్రియను కూడా మొదలు పెట్టకపోవడం బాధాకరమన్నారు. నాలుగు నెలల పాలనలో కరెంట్, సాగు, తాగునీటి సమస్యలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లున్నా ఇవ్వలేదన్నారు. పెద్దపల్లి జిల్లాలోనే వేల ఎకరాల్లో పంటలు నష్టపోతే.. ఓ మంత్రి మాత్రం రాష్ట్రం మొత్తంగా మూడు వేల ఎకరాల్లోనే నష్టం జరిగిందనడం బాధాకరమన్నారు. రైతులకు నష్ట పరిహారం ఎగ్గొట్టేందుకే ఇలా తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటి వరకు దేవుళ్లపై ఒట్లు పెట్టి హామీలను అమలు చేస్తానని చెప్పిన సీఎంలు లేరని, ఆ ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలను నమ్మించేందుకు ఏకంగా దేవుళ్లపైనే ఒట్లు పెడుతూ గిన్నిస్ బుక్ రికార్డు కోసం ఆయన ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్న ఏకైక వ్యక్తి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, ఎగోలపు శంకర్‌గౌడ్, శంకేసి రవీందర్, వెల్పుల గట్టయ్య, గొబ్బూరి వంశీ, కాయితీ సమ్మయ్య, పెగడ శ్రీనివాస్, ఆసిఫ్, మంథని లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోదావరి నీళ్లను కొల్లగొట్టే కుట్ర

అనుసంధానం చేస్తే కరీంనగర్, వరంగల్, మెదక్ ఉమ్మడి జిల్లాలు ఎడారే

- నదుల అనుసంధానం పేరిట కేంద్రం పన్నాగం
- తమిళనాడులో రాజకీయ ప్రయోజనాల కోసమే
- అయినా బండి సంజయ్ ఎందుకు మాట్లాడడం లేదు
- కాఫర్ డ్యాంను కట్టాలని చెప్పినా కాంగ్రెస్ పట్టించుకోలేదు
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నదుల అనుసంధానం పేరిట తెలంగాణకు జీవధార అయిన గోదావరి జలాలను కొల్లగొట్టే కుట్ర చేస్తున్నదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. తమిళనాడులో రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఇదంతా చేస్తున్నదని మండిపడ్డారు. నిత్యం ధర్మం గురించి మాట్లాడే బండి సంజయ్ జలదోపిడీ గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చిన తర్వాతనే ఈ ప్రక్రియ చేపట్టాలని, అలా తేల్చకుండా నదుల అనుసంధానం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర భారతదేశంలోని బ్రహ్మపుత్ర, గంగా నదులు ఏడాదిలో 365 రోజులు ప్రవహిస్తాయని, గోదావరి, కృష్ణా నదులు వాటి మాదిరి కాకున్నా దేశంలోని అతి పెద్ద నదుల్లో ఇవీ ఉంటాయని తెలిపారు. తెలంగాణ వాటా తేల్చకుండా నదుల అనుసంధానం చేయవద్దని గతంలో కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కుట్రలో భాగంగానే ఇచ్చంపల్లి ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని, ఈ నెల 15న కేంద్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు వంద మీటర్ల ఎత్తు పెంచి కడితే వేలాది ఎకరాల అటవీ భూములు నీట మునుగుతాయని, ఈ విషయంలో కేంద్రం ఏం చెబుతున్నదో, రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొన్నదన్నారు. 1985లో ఇచ్చంపల్లి నిర్మించాలనుకున్నప్పుడు మహారాష్ట్రతోపాటు అప్పటి మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్తరాదిన ప్రవహించే గంగా, మహానది, బ్రహ్మపుత్ర నదులను అనుసంధానం చేయకుండా దక్షణాదిలోని కృష్ణా, గోదావరి, కావేరి నదులను అనుసంధానం చేయడంలో కుట్రకోణం ఉన్నదన్నారు. తెలంగాణ జలాలను కొల్లగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నా బండి సంజయ్ మాట్లాడక పోవడం శోచనీయమని విమర్శించారు. నోరుతెరిస్తే ధర్మాన్ని గుర్తు చేసే ఆయనకు ఇది అధర్మమని తెలియడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని తాను అనేక సార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించానని, ఇప్పటి నీటి పారుదల శాఖ మంత్రి ఉతమ్ కుమార్‌రెడ్డి కూడా ఆయన ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. భద్ర, బుందేల్‌ఖండ్ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం తెలంగాణ ప్రాజెక్టులను విస్మరించిందని మండిపడ్డారు. దీనిపై తెలంగాణ బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. రాష్ట్రంలోని నలుగురు ఎంపీలు ముఖ్యంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నదుల అనుసంధానాన్ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ మంత్రిత్వ శాఖల వద్దకు వెళ్లి నిధులు రాబట్టాలని హితవుపలికారు. తెలంగాణలోని సమ్మక్క బరాజ్, సీతమ్మ సాగర్ తదితర ప్రాజెక్టులకు అనుమతులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కానీ, ఇప్పటి వరకు అలా చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులన్నింటికీ దేవుళ్ల పేర్లు పెట్టామని, మేడిగడ్డకు లక్ష్మీ బరాజ్, అన్నారానికి సరస్వతీ, సుందిళ్లకు పార్వతీ, లక్ష్మీపూర్‌కు గాయత్రీ, మిడ్‌మానేరుకు రాజరాజేశ్వర ఇలా అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ అని పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మేడిగడ్డ కుంగింది వాస్తవమని, దీనిపై కేంద్రం విచారణ జరిపితే నిజానిజాలు వెలుగులోకి వచ్చేవన్నారు. మేడిగడ్డ వద్ద ప్రత్యామ్నాయంగా కాఫర్ డ్యాం నిర్మించాలని మొదటి నుంచి చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం వినలేదన్నారు. సకాలంలో కాఫర్ డ్యాం నిర్మించి ఉంటే 50 టీఎంసీల నీటిని తెలంగాణ వినియోగించుకునేదన్నారు. ఈ పని చేయకపోవడంతో మధ్య, దిగువ మానేరు జలాశయాలు ఎండిపోయాయని, మత్స్యకారులు కూడా నష్టపోవాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు గడ్డం నాగరాజు, కర్ర రాజశేఖర్, పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

> గోదావరిలో ఇప్పటికీ 1200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. తెలంగాణ నీళ్లను తమిళనాడుకు తరలించే ప్రయత్నంలో ఉన్నది. అక్కడి రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఇదంతా చేస్తున్నది. కరీంనగర్, వరంగల్, మెదక్ ఉమ్మడి జిల్లాలు గోదావరిని నమ్ముకుని బతుకుతున్నయి. ఇప్పుడు గోదావరిని కావేరితో అనుసంధానం చేస్తే ఈ జిల్లాలు ఎడారిలా మారిపోతయి.
>
> - బోయినపల్లి వినోద్ కుమార్

ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తుల బదిలీలు

కోర్టు చౌరస్తా, ఏప్రిల్ 23 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, వారి స్థానంలో నియామకాలు చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విజిలెన్స్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం అరుణ సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్‌కు బదిలీ కాగా, ఈ స్థానంలో సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్ శ్రీలేఖను నియమించారు. హైదరాబాద్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాధిక జైస్వాల్‌ను సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్‌ను మేడ్చల్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి ఎం అర్జున్‌ను మేడ్చల్‌కు బదిలీ చేయగా, ఈ స్థానంలో సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు స్వప్న రాణిని నియమించారు. గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్ రాజ్‌కుమార్‌ను సికింద్రాబాద్‌కు బదిలీ చేయగా, ఈ స్థానంలో హన్మకొండ సీనియర్ సివిల్ జడ్జి బృంగి శ్రీనివాసులను నియమించారు. మంథని సీనియర్ సివిల్ జడ్జి ఈ భారతిని చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

వడ్లకు బోనస్ ఏది?

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 23 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, వరికి ₹500 బోనస్ ఏదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. హనుమాన్ జయంతి రోజు జీవన్‌రెడ్డి హనుమంతుడి సాక్షిగా బాండ్ పేపర్ రాసిచ్చి, దేవుడి సాక్షిగా ప్రమాణం చేసి మాట తప్పడం సరి కాదని సూచించారు. గతంలో అర్వింద్ పసుపుబోర్డు కోసం బాండ్ పేపర్ రాసిచ్చినా అది అమలు కాలేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలతోపాటు దేవుళ్లను ఎన్నికల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. గతేడాది నవంబర్ 27న ఎడ్ల అంగడిలోని ఆలయంలో హనుమంతుడి పాదాల సాక్షిగా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి బాండ్ పేపర్ రాసిచ్చారని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి 150 రోజులు గడిచినా అమలు కాలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ₹2500 అమలు కాలేదన్నారు. ఆర్టీసీ బస్సులు పెంచకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, గతంలో కోరుట్ల నుంచి భద్రాచలానికి బస్సు ఉండేదని, దాన్ని కూడా బంద్ చేశారన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి ₹15 వేలు, కౌలు రైతులకు ₹12 వేలు, ధాన్యానికి ₹500 బోనస్ ఇస్తామని చెప్పారని, కానీ అమలు కాలేదన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ప్రజ లు ఓట్ల రూపంలో బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మైనార్టీ పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, జడ్పీటీసీ మహేశ్, మాజీ కౌన్సిలర్ బాలే శంకర్, కౌన్సిలర్ క్యాదాసు నవీన్, సోషల్ మీడియా అధ్యక్షుడు అలిశెట్టి వేణు,ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీరామ్ భిక్షపతి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమకు బండి చేసిందేంటి?

తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

మాట్లాడుతున్న తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం నుంచి బయటపడేసేందుకు నీవు చేసిందేంటని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ప్రశ్నించారు. నేతన్నల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన మూడు బోర్డులను కేంద్రం రద్దు చేస్తే ఆయన ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా వస్త్ర పరిశ్రమ బంద్ కావడంతో ఉపాధి కరువై ఓ నేతన్న ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ నేపథ్యంలో మళ్లీ సిరిసిల్లలో ఆకలి చావులు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో సీఐటీయూ ఆధ్వర్యంలో జేఏసీ పోరాటం చేసిందన్నారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ అనుబంధ సంఘాలు జేఏసీగా ఏర్పడి చేసిన పోరాటాన్ని బండి తన రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నారని విమర్శించారు. జేఏసీ పోరాటంతో ₹50కోట్లు విడుదలైతే.. తాను లేఖ రాయడంతో ప్రభుత్వం దిగొచ్చి ₹50కోట్లు విడుదల చేసిందని ఆయన చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని ఖండించారు. కార్మికులను ఆదుకోడానికి కేంద్రం నుంచి సంజయ్ ఏమైనా వస్త్ర ఆర్డర్లు తెచ్చారా..? అని నిలదీశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో ఈఎస్ఐ దవాఖాన నిర్మాణం కోసం నయాపైసా తీసుకురాలేదని విమర్శించారు. ఐదేండ్లుగా ఎంపీగా ఉండి నిధులు తేలేని సంజయ్ సిరిసిల్ల ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 5,200మంది నేతన్నలకు రావాల్సిన ₹18కోట్ల యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోర అజయ్, నాయకులు ఎల్లా రెడ్డి, గణేశ్, రాజశేఖర్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

బతుకు బండి..

'బతుకు భారం.. బండెడు కష్టం' అన్నట్టు రెక్కలు ముక్కలు చేయనిదే పేదోడి ఇల్లు గడువదు. కుటుంబం అవసరం తీరదు. చేసే పని బరువైనా.. భారమైనా రేయింబవళ్లూ శ్రమిస్తాడు. అందుకు ఈ చిత్రమే నిదర్శనంగా నిలుస్తున్నది. జాతర్లలో చిన్న పిల్లల ఆటవస్తువులు అమ్ముకునే వ్యక్తి ఇలా మండుటెండలోనూ తన గూడ్స్ టీవీఎస్ ఎక్సెల్‌పై సామగ్రిని తరలిస్తూ కనిపించగా, 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మాలవిరమణ మండపంలో దీక్షాపరులు

జై బోలో హన్మాన్‌కీ..

- మార్మోగిన కొండగట్టు క్షేత్రం
- వైభవంగా హనుమాన్ చిన్న జయంతి

స్వామివారిని దర్శించుకుంటున్న దీక్షాపరులు

హనుమాన్ చిన్న జయంత్యోత్సవాల్లో భాగంగా వేలాది తరలివచ్చిన దీక్షాపరులతో కొండగట్టు అంజన్న క్షేత్రం కాషాయ శోభితంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా తరలివచ్చిన దీక్షాపరులు సోమవారం అర్ధరాత్రి నుంచే మాలవిరమణకు సిద్ధం కాగా, కొత్త కోనేరు, మాలవిరమణ మండపం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. 'రామలక్ష్మణ జానకీ.. జైబోలో హన్మాన్‌కీ' 'శ్రీరామ జయరామ, జయజయ రామ' అంటూ రామనామ సంకీర్తనలతో అంజన్న క్షేత్రం మార్మోగింది. దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు అంజన్న ఆలయానికి రాగా, అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలువురు మహిళలు సైతం పాదయాత్రగా కొండగట్టుకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలత్తకుండా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఏఎస్పీ వినోద్‌తోపాటు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు.

- మల్యాల, ఏప్రిల్ 23